# శ్యామల

గుంటూరులో మొన్న మొన్నటిదాకా సబ్ జడ్జీ చేసి జనేవరినెలలో కాలంచేసిన శ్రీధరరావుగారి స్వకీయ చరిత్ర యీ క్రింద ముద్రిస్తున్నాము. ఆయన చనిపోయిన కొన్ని నెలలదాకా ఆయన కాపుర మున్న యిల్లు తాళము వేసియుండెను. తరవాత ఆయన అల్లుడును మా స్నేహితుడును అయిన ముకుందరావు తాళములు తీయించి యింట్లో ప్రవేశించెను. శ్రీధరరావుగారి కాగితములు పరిశీలించడములో ఈక్రింది స్వకీయ చరిత్ర ఆయన సొరుగుపెట్టెలో దొరికినట్లూ, అది 'సాహితి' లో ప్రకటించ వలసినదనీ మాకు చెప్పడంచేత దాన్ని మేము ప్రకటిస్తున్నాము. ఆంధ్రదేశంలో వున్న పెద్దవుద్యోగస్థులలో మంచి వాడనిన్నీ దానశీలు డనిన్నీ, ఉపకారబుద్ధి కలవాడనిన్నీ పేరుప్రతిష్ఠలు సంపాదించిన శ్రీధరరావు గారిని ఎరుగని ఆంధ్రు లుండరు. కాని, మొదటినుంచీ పెళ్ళి చేసుకో వక బ్రహ్మచారిగానే వుండి నిష్కళంకప్రవర్తనము కలవాడై వుండుటకు కారణము ఎవరికీ ఇదివరలో తెలిసివుండదు. ఇదివరలో చాలామంది ఆయన బ్రహ్మచారి కాడనిన్నీ ప్రథమభార్య పోయిన తరువాత

మళ్ళీ పెళ్ళి చేసుకోవడం మానివేసినాడనన్నీ చెప్పుకోవడం కలదు. ఆ అభిప్రాయం యథార్థము కాదని యీ ఆత్మచరిత్ర చదివిన వారికి బోధపడ గలదు. అంతే కాకుండా నిజమైన ప్రేమ సౌఖ్యం ఆయన అనుభవించినాడని కూడా అంతరంగా తెలియగలదు. నిజమైన ప్రేమను ప్రతిఫలము ప్రేమించిన వారికో సౌఖ్య మనుభవించడమే అంతే ఆయన ప్రేమకు ప్రతిఫలము మాత్రలేదని చెప్పవచ్చును. ప్రేమించడమే సౌఖ్యముగా భావించి ఆ సౌఖ్యమే ప్రేమకు ప్రతిఫలముగా గ్రహించిన మొదలు పుట్టిన సౌఖ్యం ఆయన కున్నదే చెప్పవలెను.

ఇంతకంటె విషయము చెప్పి యింతటితో ఈ పీఠిక ముగిస్తున్నాము. ఆయన చిన్నతనమునుంచీ తెలుగు భాషయెడ అభిమానము గలవాడని, ఆంధ్రత్వ మీయనయందు మూర్తీభవించిన గని ఒక్క అంశమును బట్టి నిర్ణయించవచ్చును. ఇంగ్లీషుభాషలో నిరంకుశంగా వ్రాయగలిగి వుండిన్నీ ఈయన స్వీయ చరిత్రము మొదటినుంచీ చివరవరకూ ఆంధ్రములోనే వ్రాసి వున్నాడు. ఆంగ్లత్వ మాదర్శముగా వుంచుకొన్న నేటి విద్యాధికులు ఉద్యోగస్థులు విద్యార్థులూ ఈవిషయమును గమనించవలెను!

౧

నేను కాలేజీక్లాసుల్లో చదువుకొంటున్న కాలంలో వున్న వుత్సాహం ఇప్పుడు రమ్మంటే ఎలా వస్తుంది? అప్పటి చురుకుదనము, అప్పటి తెలివి తేటలు లేవని నా స్నేహితులంతా నన్ను ఎత్తిపొడుస్తూ వుంటారు. అప్పటిసరదాయే లేదని మరీ నన్ను పురికొల్పుతూ వుంటారు. స్నేహితులు పురికొల్పినంత మాత్రాన పోయినది మళ్ళీ వస్తుందా? పోవుటకు కారణం నా స్నేహితులకు తెలియదు. నాకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు.

నా తల్లిదండ్రులు ఇంతా అంతా కాదు నన్ను బలవంతపెట్టడం పెళ్ళిచేసుకోమని. నేను చేసుకోనని భీష్మించుకు కూర్చున్నాను. పెళ్ళి చేసుకోకపోతే వంశం అంతరిస్తుందనీ, పుట్టగతులుండవనీ ఎన్నోవిధాలుగా నయాన్నీ భయాన్నీ చెప్పి బోధించారు. పదిమంది చేతా చెప్పించారు. ఎంతచెప్పినా ఎంతచెప్పించినా నేను విన్నాను కాను. మొక్కగా వున్నప్పుడే వంచకుండా వూరుకొని చెట్టైనతర్వాత వంచడానికి ప్రయత్నించడంవల్ల ఇంతమట్టుకు వచ్చిందనుకొని వూరుకున్నారు. ఊరుకున్నారూ— రోజుకు ఎన్ని రాయ

భారాలు స్నేహితులచేత—ఎన్ని సాధింపులు—కుక్క మీాదా పిల్లిమీాదా పెట్టి ఎన్ని తిట్లు—నాప్రాణం కొరుక్కుతిన్నారు! ఎన్నో కొన్ని సంవత్సరాల వయస్సు వెళ్లినమీాదట పుత్రుణ్ణి మిత్రుడిలాగ చూచుకోవాలన్నసంగతి వాళ్ళకు తెలియక గాదూ నన్ను ఇలా వేధించడం!

ఇంతకూ వీళ్ళవల్ల నాకు కలిగే కష్టములు ఎంత పాటి? నే నిదివరలో అనుభవించిన మనఃక్లేశములో ఇది ఎన్నోపాలు? పగ లనక రాత్రి అనక—ఆశ పెట్టుకొని, ఆశ నిరాశ కాగా పొందిన చిత్తసంక్షోభమునకూ, దీనికీ సాటి వున్నదా? ధనము పోతే అంత బెంగ వుండ దనుకుంటాను, బంధువులు పోతే అంత బెంగ వుండ దనుకుంటాను. ఇంక ఏమి పోయినా మనిషికి గలిగే దుఃఖలేశము అనునయమువల్ల అంతరిస్తుంది. కాని నాకు కలిగిన దుఃఖము ఆమరణాంతము న న్నంటి వుండవలసిందే, నాతోను నీ డై వుండవలసిందే! ఈదుఃఖమే నాప్రాణమిత్రము. ఈదుఃఖము నన్ను ప్రేమించి న న్నంటి తిరుగుతూ వుంది. నేను దీనిని తిరిగి ప్రేమించకుండా వుండలేను.

నాకు పుట్టిన ఈదుఃఖమును నేను ప్రేమిస్తా నంటే లోక మెందుకు నవ్వడం? లోకంలో ఎవరికి పుట్టిన

పిల్లలను వారు ప్రేమించకుండా వున్నారా? ఎందుకని తమ బిడ్డలను తాము ప్రేమిస్తున్నారు? తెలివి గలవా రనా? పశుతుల్యులే! అందము గలవా రనా? అందము లోకములో సామాన్యలక్షణము కాదే! ఆనందము కల్పిస్తున్నా రనా? ఎలా ఆనందము కల్పిస్తున్నారు? తమకు పుట్టిరి కాబట్టే ఆనందము కల్పిస్తారు. ఇతరులకు పుట్టినబిడ్డలు ఆనందము కల్పిస్తున్నారా? అలాగే నాకు పుట్టిన యీ నా చిత్తక్లేశమును నేను ప్రేమిస్తాను. బిడ్డలతోటి సంసారము ఆనందదాయక మైతే ఇదీ ఆనందదాయకమే.

దీనిని మరణకాలాన నాతో కొనిపోతాను. నేను కాలముచేసిన పిమ్మట నాభౌతికదేహము అగ్నిజ్వాలల కాహుతి అవుతుంటే ఈదుఃఖము నాచితిపై కెక్కి సహగమనము చేస్తుంది. ఇటువంటిదుఃఖమును నేను వదలగలనా? నేను వదలలేను! ఈదుఃఖమే నాకు సుఖము ఇస్తూవుంటే నేను దీన్ని ఎలా విడవగలను? సుఖదుఃఖములు కవలపిల్లలు. లోకములో అందరూ సుఖమనేపిల్లనే ప్రేమిస్తారు, నేను దుఃఖమును ప్రేమిస్తాను; అదే నాసుఖము, కాదా! నేను పరితపిస్తూవున్నట్లు పరితపించే ఎవ్వడైనా ఈదుఃఖ మనే ప్రాణమిత్రుణ్ని వదలి వుండగలడా? ఉదయకాలమున, చల్లని వాయు

వులు విసురుతూ లోకానందమును కల్పిస్తూవున్న సమ
యాన నేను నాదుఃఖమును ఆహ్వానము చేస్తాను. సా
యంకాలమున సైకతముల విహరిస్తూ నాదుఃఖముతో
సరససల్లాపము లాడుతాను. రాత్రి వేళలకటికినేలల
పరుండి నిద్రను దూరముగా పారదోలి దుఃఖముతో
కూడిఆడుతాను. ఈదుఃఖ మనగా ఎవ్వరు? ఈదుఃఖ
ము నా కెందువల్ల కలిగింది? ఏవధూటిచల్లనిచూపులు
నాపై పడగా, నేను ఒకప్పుడు పరవశుడనై వుం
టినో అట్టి వధూటి నాకు పారితోషికంగా ఒసగిన
దుఃఖము కాదా యిది? ఏలతాంగికరస్పర్శ నాకు
పులకలెత్తించిందో ఆలతాంగి నాకు పరిచర్య చేయ
పంపిన చెలికత్తె గాదా యిది? ఏమనోహారిణివిగ్రహ
ము నాహృదయపీఠముపై నెలకొనివున్నదో ఆమనో
హారిణి నాహృదయముపైన వుంచినశాశ్వతముద్ర
గాదా యిది? ఏసుందరాంగి వదనగహ్వరమున తాం
డవమాడే ప్రాణవాయువు నాకు ప్రాణము ఒసగిందో
ఆసుందరాంగి నాకు పోసినజీవము గాదా యీదుఃఖ
ము? ఏసుకుమారగాత్రి నాహృదయకోశమున ప్రణ
యవజ్రములు తొలుదొల్త దాచివున్నదో ఆవజ్రముల
కర్కశత్వము కాదా యీనాదుఃఖము?

ఇట్టిదుఃఖము నాదగ్గరకు వచ్చి నన్ను మోహించి నప్పుడు వద్దు పొమ్మనగలనా? ఈదుఃఖమును నాహృదయపీఠముపైన అధిష్ఠింపజేశాను. బాష్పధారలతో దీనికి అర్ఘ్యపాద్యాలు ఒసగుతుంటిని. ఆత్మచింతలను ధారపోసి పోషిస్తుంటిని, కొలుస్తుంటిని. ఆహా! ఏమి నాసుఖము! ఏమి నాఆనందము! లోకమా, ఒక్కమారు నీకడ వున్న దుఃఖము నంతనూ నాకు వదలి వెయ్యి. ఆదుఃఖసాగరాన బడి నే నీదులాడుతాను, పరవశత్వము జెందుతాను, అపూర్వసౌఖ్యం అనుభవిస్తాను!

ఈనాదుఃఖము నన్ను భక్షించి బతుకుతున్నది. నేను లేకుంటే దీని కాహారము లేదు. దుఃఖమును తిని బతుకుతున్నాను నేను. ఈదుఃఖము లేకుంటే నేను బతకలేను. దుఃఖము నన్ను తింటున్నది, నేను దుఃఖమును తింటున్నాను. ఇందులో వింత లేదు. వృక్షములు జంతువుల కాహారమిస్తున్నవి- జంతువులు వృక్షములను పోషిస్తున్నవి; వృక్షములు జంతువులను తింటున్నవి, జంతువులు వృక్షములను తింటున్నవి. సృష్టికి మొదలు వుంటే అప్పటినుంచీ ఈసాంప్రదాయం ఇలాగే జరుగుతూవుంది.

## ౨

నేను కాలేజీలో చదవడానికి చెన్న పట్టణము వెళ్ళితిని. ఏముహూర్తాన వెళ్ళితినో ఆముహూర్తము మంచి దననా, చెడ్డ దననా? చెడ్డ దనడం ఎందుకు? మంచిదే అంటాను.

వెళ్ళినతర్వాతనే కదా నాలో సుషుప్తి గాంచి వున్నచిత్తవృత్తు లన్నీ ఒక్కమాటు ఉలిక్కిపడి లేచినవి! నాహృదయములో మొగ్గదొడుగుతూవున్న అనురాగవల్లిక ఒక్కమారుగా పుష్పించింది. నాజీవితమంతా ఒక్కసారి ఆశాచంద్రికలో ఓలలాడింది. నేను వెళ్ళడంవల్లనే కదా నాజీవితానికి పట్టుగొమ్మ ఒకటి లభించింది, లక్ష్య మొకటి చిక్కింది!

రెండవసంవత్సరం చదువు ముగియడానికి సిద్ధంగా వుంది. ఇక పదిపదిహేను రోజుల్లో కాలేజీకి సెలవు లిస్తారు. అంతవరకూ నేను చాలా శ్రద్ధగా చదువుతూవున్నాను. పుస్తకాలు విడిచి నేను ఎప్పుడూ దూరముగా వుండలేదు. అప్పుడు పుస్తకము చూస్తే ఆప్తబంధువును చూసినట్లు వుండేది. పుస్తకము లప్పుడు నాకు జీవము లేని పదార్థములుగా తోచలేదు.

సజీవములై, సన్నిహితబంధువులై నన్ను కనిపెట్టుకు వున్న ప్రతిభాశాలురవలె వుండేవి. ఇట్టిపుస్తకాలమీద ఆనాటినుంచీ నాకు విముఖత్వం కలిగింది. ఈఆప్త బంధువులను ఆనాటినుంచీ దూరముగా పారదోలినాను. ఈప్రతిభాశాలుల హితవాక్యాలానాటినుంచీ వినకుండా పెడచెవిని పెట్టినాను. ఏనాటినుంచీ?

నేను చదువుతూ వున్నక్లాసులోనే చదువుతూ వున్నది శ్యామల. నాపుస్తకాలను నేను ప్రేమించి వున్న కాలములో శ్యామలపేరు నే నెరగను. నాపుస్తకాలిచ్చే ఆనందములో పరవశుడనై వున్నదినములలో శ్యామలను కన్నెత్తి చూడలేదు.

ఒకనాడు నానోటుబుక్కు బల్లమీద విడిచి వెళ్ళితిని. మళ్ళీ తిరిగివచ్చి చూచుకొంటిని. నాకళ్ళయెదుట రెండుపేర్లు కనుపించినవి. నాపేరు పైన వున్నది. కింద శ్యామలపేరు వున్నది. ఈరెండుపేర్లు శ్యామలే వ్రాసిందని గ్రహించడంలో నాకు కష్టం లేకపోయింది. ఎవ్వరూ చూడకుండా రాసివుండాలి అనుకున్నాను.

ఆక్షణాన నేను పూర్తిగా మారిపోయినాను. ఆక్షణాన నాచిత్తములో నూతన సంస్కరణము జరిగింది. నూతనజీవితయాత్ర చేయడానికి మొదలుపెట్టినది నేనాక్షణములోనే! అప్పుడు నాకు కలిగినవుత్సాహము,

నూతనభావోదయము, పరమానందమూ అనిర్వచనీయములు.

రెండుపేర్లను నేను చదువుకొని శ్యామల కూర్చున్న బల్లవేపు చూశాను. ఆమె తలవంచి చిరునగవుతో ఏమో వ్రాసుకొంటున్నది.

ఆమెను పరిశీలించి చూడడాని కదే మొదటి పర్యాయము. ఆమె అప్పుడు నాకన్నులకు మర్త్యభామినివలె తోచలేదు, ప్రణయ జ్యోత్స్న వలె తోచింది! తూర్పుదిక్కున వుదయించే చంద్రబింబంలాగ మెరుస్తూ వున్నది కుంకుమ బొట్టు ఆమె ముఖాన.

మధ్యాహ్న కాలాన నడిమింట మార్తాండబింబం లాగ ప్రజ్వలిస్తున్నది అనురాగం ఆవిడ హృదయాన. సాయంకాలాన పక్షులు ఎలుగెత్తి పాడేప్రణయగీతములు ప్రతిధ్వనిస్తున్నవి ఆమె హృదయంలో. తేట వెన్నెల నిగ్గులలో దోబూచు లాడే జీవకాంతులు ప్రకాశిస్తున్నవి ఆవిడ కళ్ళల్లో.

ఆనాటినుంచీ నేను పుస్తకములు ముట్టలేదు, చదువుమాట తలపెట్ట లేదు. ఆనాటినుంచీ నేను శ్యామల పేరు జపించడం మొదలు పెట్టినాను. ఆనాటినుంచీ

నాకు శ్యామల ప్రత్యక్షదైవత మైనది. నిద్రను జయించాను, ఆకలిని జయించాను. ఆమెప్రాపు గైకొనడానికై ఎంతటిత్యాగమైనా చేయగలను. మూర్తీభవించిన సౌందర్యరాశిమ్రోల యెట్టినూడికయైనా పెట్టగలను. విలువ తెరగని ప్రణయసౌధమున నివసించడానికి లోకముతో సంబంధం వుండకూడదు. అట్టి సంబంధాలన్ని వదలుకున్నాను.

శ్యామల మహారాష్ట్ర బ్రాహ్మణయువతి, అవివాహిత. సంఘసంస్కర్తలయింట పుట్టింది. యౌవనలావణ్యాము పుంజీభావము చెందివున్నది ఆమెయందు. నే నాంధ్రుడను, ఆమెపై నామనస్సు లగ్నము కానేల? కాకూడదా? బహుత్వము మానవులందు గాన వచ్చినా ఏకత్వభావము వారి హృదయమునకు బట్టలేదా? ఇంక జాతివిచక్షణ యెందుకు?

సంతోష మనగా ఎట్టిది? దుఃఖాభావమా సంతోషము? కాదు. ప్రణయాగ్నిజ్వాలలలో బడి తప్తమవుతున్న నాకు సంతోషము గాక దుఃఖ మెట్లు? సహింప శక్యము కాని ప్రణయ ఝంఝూనిలంలో బడి ఊపిరి తిప్పుకోలేకుండా వున్న నాకు సంతోషము కాదా?

గంభీరమై, తరింపనలవి గాని ప్రణయసాగరాన బడికొట్టుకొంటున్న నాకు సంతోషమే కదా! బ్రహ్మ సృజించినవస్తువులందు ప్రేమ లేకుంటే సృష్టి కెంత లోపము వచ్చి వుండేదో!

ఆమె విగ్రహం ఆనాటినుంచీ నాకు కళ్ళకు కట్టినట్లు వుంటూవుండేది. ఆరోజు మొదలుకొని నేను కాలేజీకి పదిగంటలకు ముందే వెళ్ళి కూర్చుని ఆమె రాకకు ఎదురు చూస్తూవుండేవాడను. ఆమె అడుగులచప్పుడుకు నా గుండె తాళము వేస్తున్నట్లు కొట్టుకొనేది. ఆమెవిగ్రహము ను చూడడమే నాకు తృప్తిగా వుండేది. ఆమెతో మాటలాడడం సహితం లేదు. ఆమె విగ్రహమునుంచి వెడలి వచ్చేలావణ్యకాంతులను కన్నులతో తృప్తితీర తాగేవాడను. ఆమెవిగ్రహం ఎదురుగా వున్నసమయంలో నేను చెప్ప లేనిఆనందము చెందేవాడను. ఆమె విగ్రహాన్ని వీక్షించడానికి ఎప్పుడూ నేను ఉవ్విళ్ళూరుతూ వుండేవాడను.

ఆమెరాక నాకు ప్రమోదకారణము, ఆమెపోకడ విషాదకారణము.

ఆమె సాయంత్రం కాలేజీనుంచి వెళ్ళిపోయేటప్పుడు చూపు మేరదూరం ఆమెను చూస్తూ వుండడమే

నావని. ఆమె దృష్టిపథం దాటి వెళ్ళినతోనే నాగుండెలో రాయి పడేది. మరునాడు పదిగంటల వరకూ కాలము వెళ్ళబుచ్చడం ఎలాగు?

నాజీవితం అప్పుడు శుష్కముగా వుండేది. కాని మరునాడు వస్తుంది గదా, వస్తే మళ్ళీ జీవితానికి ఆనందం వుంటుందిగదా అనేఆశ వూతగా వుండేది.

ఊనుపోక ఒక్కొక్కప్పుడు నేను సాయంకాలము మైలాపూరు వెళ్ళేవాడను. మైలాపూరులో ఆమె కాపుర మంట. ఆమెయింటివద్ద నేను గడిపినకాల మింతింతకాదు. ఎందుకు గడిపిన? ఆమెవిగ్రహము నాకగుపించుననా? కాదు. ఆమెతో ప్రసంగించవలెననా? కాదు. ఆమెమాటలు వినవచ్చుననా? కాదు. ఎందుకు అక్కడకి వెళ్ళితినో నాకు తెలియదు. నాహృదయము నన్ను అక్కడకు పట్టి ఈడ్చుకొని పోయేది. అంతే నే నెరుగుదును. ఒక్కొక్కప్పుడు ఆమె విగ్రహము నాకు కనువిందు చేసేది. ఆమె అవ్యక్త మధుర కంఠధ్వనులు నావీనులకు విందు చేసేవి. ఆమెమీదుగా విసరేగాలి నన్ను రాచుకుపోయేది. ఆమె ఆఘ్రాణించిన పువ్వులవాసన ఒక్కొక్కప్పుడు నానాసాపుటముల దరి జేరేది. ఆమెపైన బడిన దీపపుకాంతులు ఒక్కొక్కప్పుడు కిటికీనుంచి వచ్చి నాపై బడేవి! అది

చాలదా? ఆఆనందముకు సాటివచ్చు ఆనందము కలదా? సెలవు లిచ్చేవరకూ ఇట్లు నేను కాలం గడపినాను. సెలవులు రెండునెలలూ నేను కాలం గడవడం ఎలాగు? సూర్యకిరణము సోకుతూ వున్నప్పుడే మొక్క ఏపుగా పెరిగి పువ్వులు తొడుగుతుంది; చీకటిలో పెరగగలదా? సముద్రంలో వుండే జలచరములు సహితము సూర్యకాంతికోసం పగటి వేళ పైకి వస్తవి; ఎప్పుడూ అనుగున కూచోవు.

ఈరెణ్నెల్లూ గాంధాంధకారములో నేను మసలగలుగుదునా? నెలకు కొన్నిరోజులపాటు వెన్నెల వుంది కాబట్టే లోకం కలవరం చెందడం లేదు. ఒక్కమారైనా వెన్నెల చూడకుండా రెండునెలలు నేను బతకగలనా? సముద్రములో పడవకు తెరచాపలు చిరిగిపోతే దానిగతి ఏం కావలసింది? స్టీమరులో ఇంజను పాడైపోతే నడిసముద్రంలో అది ఏమి కావలసింది?

తుట్టతుదకు మనస్సు గట్టిపరచుకొని నేను శ్యామలకు ఒక చీటీ వ్రాసి పంపినాను. ఇదివరలో ఆమెతో ఒక్కమారైనా మాటాడ లేదు. ఒక్కమారైనా ఆమెకు వుత్తరం రాయలేదు. ఈమారే వ్రాశాను. ఈరీతిగా రాశాను.

"శ్రీమతీ: తలవని తలంపుగా మీరు నాపై చూపిన ఆదరముకు కృతజ్ఞుడను. ఈఆదరము స్నేహంగా పరిణమించడానికి నే నాశపడుతున్నాను. మీయోగక్షేమములు నాకు సెలవులలో తెలియచేయవలెనని కోరుతున్నాను. అందు కనుగుణముగా మీరు మీచిరునామా నాకు పంపవలయును. ఇట్లు నేను స్వతంత్రించి వ్రాయుట మీకు అసమ్మతము కాదని సూచించుటకు నాకు జవాబు వ్రాయవేడుతాను.

మీవిశ్వాసపాత్రుడు శ్రీధరరావు."

ఈచీటిని పోష్టుద్వారా పంపి జవాబుకై వేచియుంటిని. మరునాడు నాకు ఈక్రిందిరీతి జవాబు వచ్చింది.

"శ్రీయుత శ్రీధరరావుగారికి: తాము పంపిన ఉత్తరము నాకు అసమ్మత మవుతుందా? మీక్షేమము తెలిసికొనడం అనేభాగ్యమును మించిన భాగ్యము నాకు వేరుగా లేదు. నేను చూపితి నన్న ఆదరముకు మీరింతకాలము మిన్నకుండడంవలన నేను కించపడుచుంటిని, కాని మీవుత్తరము చూచిన పిమ్మట నే నాశకులోనైతిని. మీక్షేమమే నాక్షేమముగా చూచుకొనడముకు ఇష్టపడుచుంటిని. నాచిరునామా ఇందులో పంపినాను.

మీవిశ్వాసపాత్రురాలు, శ్యామల."

ఈ వుత్తరమును నే నెన్ని మార్లు చదివితినో దేవునికే తెలుసును. నే నింతకాలం ఊరకుండుటకు కారణమును నేనే గ్రహింపలేకపోతిని. ఇక నాజీవనము ధన్యమైన దను కొంటిని.

## 3

మాయిద్దరకును రెండు నెలలపాటు ఉత్తర ప్రత్యుత్తరములు జరిగినవని వేరే చెప్పవలెనా? నేను అందరాని పళ్ళకోసం అర్రు చాపలే దని వేరే చెప్పవలెనా? నామనోభీష్టము సిద్ధిస్తుందని వేరే చెప్పవలెనా? ముత్యముల కోవను బోలిన ఆమె అక్షరమాలికలు వుత్తరంలో చదివి చదివి నేను ఉన్మత్తుడ నయినాను. ప్రమదోన్మత్త! సౌహార్దమును వెలిబుచ్చే ఆమె జాబులు చదవడము నిత్యోత్సవముగా నేను పరిగణించడంలో వింత ఏమున్నది? ఆమె నాకు వ్రాసినజాబులకు లెక్కలేదు! నేను వ్రాసినజాబుల కంతకన్న లెక్కలేదు. మార్తాండు డపరదిక్కున గ్రుంకేవేళ శీతలవాత మనుభవిస్తూ ఏచెట్టుమొదటనో కూర్చుండి ఆమెవుత్తరాలు ఎన్నిమారులైనా పఠించినాను. నిశాసమయాల ఆమెసుందరవిగ్రహాన్ని మానసవీథులందు సంచరింపజేస్తిని.

నాహృదయసీమలో ఆలేఖల నన్నిటిని పదిలపరచినాను. ఇట్లు గడచినవి ఆరెండునెలలూ. ఒక్కత్రుటిలో గడచిన వనుకొంటిని. సౌఖ్యోన్నతి యెట్టిదో అప్పుడే నే ననుభవించాను. పెరుగుట విరుగుట కొరకే అని ఒకానొకకవి అన్నాడు. పెరిగితిని పెరిగితిని, చిట్టచివరకు ఇంత విరుగుతానని ఎప్పుడూ కలనైనా తలచలేదు. హఠాత్తుగా పిడుగు నాపైన పడక ముందు నామనోహారిణి ఒక్కలేఖ పంపింది. ఆలేఖే ఆమె నాకు రాసిన చివరలేఖ. ఆలేఖలోనే ఆమె నా కియ్యగలిగిన సౌఖ్యమంతా ఇచ్చింది. ఇం కామెనుండి నేను లేఖను అందే భాగ్యము కోల్పోతిని! మందభాగ్యుడ నయితిని!

“రాయదుర్గము,

౧౨.౯.౧౮౯౨

“మనోహరా: శుష్కించిన ఈనాజీవితవృక్షానికి మీరు పాదు తవ్వి నీరు పోస్తున్నారు. ఈవృక్షం ఏపుగా పెరిగి మీకు ఫలములు ఒసగ గల దని ఆశిస్తున్నాను. నాసుఖమే మీసుఖ మనీ నాదుఃఖమే మీదుఃఖ మనీ వ్రాస్తిరి. నాసుఖము మీసుఖము కావచ్చును. నాదుఃఖము మీదుఃఖము కా నిత్తునా? మీపాదసేవ చేస్తూ మీఅండను చరించవలె నని ఉవ్విళ్ళూరే నా కెన్నడైనా దుఃఖం ఉండగలదా? సూర్య

నికి ఎదురుగా వుండే గ్రహములను ఎన్నడైనా చీకటి కప్పగలదా?

"ఏనాడు మీపైన నేను వీక్షణమాలికలను బరపితినో ఆనాడే గదా నాజన్మము ధన్యమైనది!

"ఏమో తెలియదు, ఎందుకో తెలియదు! మిమ్ములిని జూచినక్షణమందే నామనస్సు మీపైన లగ్నమైనది! ఎన్నోసారులు నేను విమర్శించుకొన్నాను, నామనస్సు మీమీదికి ఏల పరుగులు పెట్టవలెనని? సూర్యునిచుట్టూ గ్రహాలు ఎందుకు తిరుగుతున్నవి? నదులన్నీ సముద్రమునే ఏల చేరుతున్నవి? అయస్కాంతము ఇనుమును ఏల ఆకర్షించవలె? దీనికి సమాధాన మేమి అనుకొన్నాను.

"దుష్యంతుడు ఎందరు స్త్రీలను చూచి వుండలేదు? అతనిమనస్సు శకుంతలపైనే లగ్నము కావడం ఎందుకు?

"ఇది ప్రకృతి శాసనమా? పూర్వజన్మ వాసనా? పూర్వజన్మాన మనము భార్యాభర్తలము కాబోలు! మనోహరా, మీదివ్య మంగళరూపము నాహృదయాన పాదుకొన్న నాటినుంచీ మీపవిత్రనామము సంస్మరిస్తున్నాను. పంచాక్షరీమంత్రము పారాయణ చేస్తున్నాను.

ఎన్నటి కైనా నాతపస్సు ఫలించునా? ఎన్నటికైనా నానోములు పండునా? ఎన్నడైనా నేను మీపాదాలను ఆశ్రయించగలుగుదునా? ఎన్నటికైనా నాహృదయము మీపాదములమీద ధారపోయ గలుగుదునా? ఆదిన మెప్పుడు వచ్చును? ఆపవిత్రదినము రావలెనని ఎంత శోషిల్లుతున్నాను! ఆశ కోల్పోతున్నాను. మనోహరమూర్తీ! నా కాశ యివ్వండి! కుంగిపోతున్నాను; నన్ను లేవనెత్తండి! నాథా, సెలవు! మీదివ్యలేఖిని సత్వరముగా నాకు ఉత్సాహమూ ఊరటా కూర్చునుగాక!

మీదాసి

శ్యామల."

ఈలేఖ చదువుకొని సంతసించినానే కాని అందున్న సందేశము గ్రహించజాలనైతిని. "ఆదిన మెప్పుడువచ్చును?" ఎన్నడూ రాదు అనేసంగతి నేను గ్రహించజాలనైతిని! ఎన్నడూ రాదా? రాదా? ఆశ నిరాశ అయిందా? లోకములో చీకటి క్రమ్మిందా? ఎన్నడూ ఆదినము రాదా? అయ్యో, ఎంతటిపాపిని! ఎంత దురదృష్టవంతుడను! ఎన్నడూ ఆదినము రాదా? అయ్యో, నేను మొదట గ్రహించలేక పోతినే! దైవప్రేరణచేత వ్రాసింది కాబోలు ఆవాక్యము! ఎన్నడూ రాదా! ఈజ

న్మలో గాకున్నా వచ్చే జన్మలోనయినా రాదా! రాక పోవునా? వచ్చును, వచ్చును, వచ్చితీరును!

## ౪

ఆశాలతలు ఒకటివెనుక ఒకటి పుటుకు పుటుకున తెగి పోవుతున్నవి. హృదయం అల్లకల్లోల మవుతున్నది.

శ్యామల చెన్నపట్టణవు పెద్దఆసుపత్రిలో రోగగ్రస్తయై మంచముపైన పడి వున్నది. నేను ఆసుపత్రిలో మతిపోయినవాడివలె సంచరిస్తున్నాను. ఆలేఖ వ్రాసిన రెండుదినాలలో పిడుగువంటి వార్త నా చెవిని పడినది.- శ్యామల జబ్బుపడి రాయదుర్గంనుంచి చెన్నపట్టణము వస్తున్నదని- ఆవార్త చెవిని పడిన పిమ్మటకూడా నే నిట్లు జీవములతో సంచరిస్తున్నాను. శ్యామల రోగగ్రస్తురాలా! నాశ్యామల! నేను ప్రేమించిన శ్యామల! నేనెవ్వతె రూపమును చూచి ప్రాణములు పోసుకొంటున్నానో ఆనాశ్యామల! అయ్యో! భగవంతు డున్నాడా?

ఆసుపత్రిలో రామారావు నాస్నేహితుడు. అతని నెప్పుడూ ఉపకారము చేయమని కోరలేదు. ఇప్పుడు కోరితిని. శ్యామలను చూడడానికి అనుజ్ఞ యిమ్మని.

అతను నన్ను సమయము చూచి శ్యామల వరున్నగది లోకి తీసుకొనిపోతూ వుండును. ఆమెగదిలో నేను పావు గంట ఉండేవాడను. తరువాత ఆసుపత్రి ప్రాకారాల చుట్టూ తిరుగుతూ వుండేవాడను. ఉదయమున ఆసు పత్రి తలుపులు తీయుటకు ముందు గుమ్మముకడ వేచియు న్నవా డెవడు? నేనే! అర్థరాత్రి ఆసుపత్రి గోడ పక్క నిలుచుండి బాష్పధారలు వర్షించేవా డెవడు? నేనే! మధ్యాన్నకాలాన చండకిరణుని వేడిలో శ్యామ లను ధ్యానము చేస్తూవుండేవా డెవడు! నేనే! శ్రమకు ఫలం ఉండునందురే! ఎక్కడ నాశ్రమకు ఫలము! ఆశీ స్సులకు ఫలము! భగవంతు డున్నాడా?

శ్యామల మంచముదగ్గర నిలుచుంటిని. అరమో డ్చిన కనుదోయి విప్పి చూచింది నన్ను నాశ్యామల. ఆచూపులే నాదేహమును కంపింపజేసినవి. శుష్కిం చిన హస్తముతో నాహస్తము పట్టుకొన్నది శ్యామల. నాదేహము స్పందించినది.

నవయౌవన తేజోవిలాసిని నాశ్యామలకా ఈపాట్లు! ఆమెముఖంవైపు ముఖం తిప్పలేకపోతిని. కన్నీటిమబ్బు లు కన్నుల గమ్మెను. గద్గదస్వరముతో 'శ్యామలా' అంటిని. శ్యామల కళ్లు మూసింది. మూసినకనురెప్ప లలో నుంచి ఒకబాష్పకణము కొలుకులగుండా జారి

మంచముపైన పడినది. కన్నులు దెరచి "మనోహరా" అన్నది. నేను కొంతసేపటిదాకా మాట్లాడలేకపోతిని. నాహృదయంమాత్రమూ మెహృదయంతో సంభాషిస్తూన్నది. "ఎట్లుంటివి? జబ్బు ఉపశమిస్తున్నదా?" అంటిని. "దుఃఖము వద్దు. నిజము చెప్పుతున్నాను. నాకాయువు చెల్లింది. మనఋణము తీరింది!" అన్నది. నేను చేతులతో తల మోదుకొంటూవుంటే 'నాథా' అన్నది. రామారావు వచ్చి నన్నవతలకు తీసుకుపోయినాడు.

ప్రభంజనం అతితీవ్రంగా వీస్తున్నది. వాయుదేవుడొక్కమారు తనసేవకులను లోకముపైకి విడిచినట్లు ఉన్నాడు. దశదిశలనుంచీ ఝంఝానిలము కొట్టుతున్నది. పంచభూతాలూ ఒక్కమారుగు మహాసంగ్రామంలో ఒకదాని నొకటి ఢీకొన్నవి. నవనవలాడే పూలమొక్కలు పూలురాల్చి మలినములైనవి. మహావృక్షములు దీనస్వరము చేస్తూ భూమిమీదికి కుంగిపోతున్నవి.

ఆసుపత్రిలో ఆరుబయట మబ్బులవెనుక వున్న సూర్యునికేసి చూస్తూ నిలబడినాను. వాయువు నన్ను నిలవనివ్వక తీవ్రంగా అన్నివైపులనుంచీ కొట్టుతున్నది. వానచినుకులు తుపాకిరవ్వలవలె మొగముపైన తగులుతున్నవి. భూమి తన రేణువులు పైకెత్తి నన్ను

గట్టిగా మోదుతున్నది. సూర్యతేజము మబ్బుల చాటు నుంచి బయలువెడలి నాకళ్ళలో పొడుస్తున్నది. భూతములు నాపైన ఆగ్రహించినవి. భూతములు నన్ను వేధిస్తున్నవి. వేధించనీ! సూర్యభగవానుడే ఆధారమని మనస్సు దిటవుచేసుకొని అతనివైపు కన్నులు తిప్పి ప్రార్థిస్తున్నాను. "లోకానికంతకూ జీవనము ఒసగగలనీవు నాశ్యామలజీవనము అపహరించడం న్యాయమా భగవానుడా! ఆమె తేజము నీలో కలుపుకో ఇచ్ఛగిస్తా వేల? నీకు తేజము కొరతపడినదా? ప్రాణికోటికి అంతకూ బంధువుడవై ఒక్క నాయెడల శత్రుత్వము వహించడానికి ఏమపరాధం చేశాను? భగవంతుడా, నా ప్రార్థన వినవా? నాశ్యామలను నాకివ్వవా? నీకేమి సమర్పించ మంటావు? ఏదైనా నీకర్పణ చేయడానికి సిద్ధంగా వున్నాను. దయ రాదా? నాశ్యామలను నాకివ్వవా?"

రామారావు వచ్చి చెయ్యి పట్టుకొన్నాడు. అతని ముఖము వెల్లబారివున్నది. నన్ను గదిలోకి వెళ్లమని సైగ జేసినాడు. ధైర్యము పూనమన్నాడు. అయ్యో! ఇంకా నాకు ధైర్యమా? మంచముపైన చలనము లేక పడివున్న నాశ్యామలను ఆఅవస్థలో చూస్తున్న నాకు ధైర్యమా? పుష్పము వాడిపోయింది. దానికాంతులు

మాయ మైనవి. శాంతమూర్తివలె పరుండి వున్నది శ్యామల. గుమ్మముదగ్గర నిలుచుండి చూస్తిని. మంచముచుట్టూ ఆమెబంధువు లున్నారు. మంచమువక్క దొరసాని నిలునబడి మందులు తాగిస్తున్నది. మందులు నంట బట్టడము లేదు.

మృత్యుదేవత ఈకబళాన్ని ఆశించింది. మృదుగాత్రులను నోటవేసికొంటే గాని దాని ఆకలి ఉపశమించదు కాబోలు!

అయ్యో, భగవంతు డున్నాడా? ఉంటే నాప్రార్థన ఏల వినకున్నాడు? ఆమెప్రాణము నిల్పడానికి నాప్రాణాలు త్రికరణశుద్ధిగా ధారపోస్తా నంటున్నానే! విన దేమి భగవంతుడు! ఆవిడరోగాన్ని మరల్చి వెయ్య మంటున్నానే, ఆరోగము నా కిప్ప మంటున్నానే విన దేమి భగవంతుడు! ఆమెబాధలన్నీ నేను భరిస్తా నంటున్నానే! ఆమెను కష్టములనుంచి విముక్తి చెయ్య మంటున్నానే! అమెబాధ చూసి సహించలేకున్నానే! ఆ బాధలు మింగివేస్తా నంటున్నానే! విన దేమి భగవంతుడు!

మంచాని కెదురుగా నిలబడితిని. శ్యామల నన్ను చూచింది, చెయ్యెత్త లేకపోయింది. ఆచేతిని

నాచేతుల్లో ఇముడ్చుకొన్నాను. ఆమె నాచేతిని మెల్ల గా నొక్కింది.

దొరసాని పెదవి విరిచి బయటికి వెడలిపోయింది. అవసానము సమీపిస్తున్నది. నాఆశ రెక్కలు కట్టు కొని ఎగిరిపోయింది. కొయ్యబొమ్మవలె నా శ్యామల కేసి చూస్తూ నిలబడ్డాను.

రంయిమని గాలి వీస్తూ ఆనుపత్రిని ఇటుఅటూ ఊగిస్తున్నది. శ్యామల నావైపు కళ్ళు తిప్పింది.

అయ్యో దైవమా! ఆమెను ఇంకొక్క యేడు బతక నివ్వవా? నాజీవములు ధారపోస్తాను; ఆమెను ఒక్కమాసము బతకనివ్వవా? నాసర్వస్వము నీ కర్ప ణము చేస్తాను. ఆమెను ఇంకొక్క రోజైనా బతక నివ్వవా? ఇంకొక్కగంట, ఒక గడియ, బతకనివ్వవా! అయ్యో!

ఆమె నాపైన వుంచిన దృష్టులు మరల్చలేదు. ఇం కెవ్వరినీ చూడడంలేదు. నాకేసి చూస్తూ చూస్తూ ఉండగా అప్రయత్నంగా ఆమెకనురెప్పలు మెల్లగా వాలిపోతూ వున్నవి. కనురెప్పలు మూసింది. లోక మంతా చీకటి గమ్మింది. సూర్యుడాకాశము విడిచి ఎక్కడికో పోయినాడు. వాయువు ప్రచండంగా ఘోష పెట్టుతున్నది!

నాక్రింద వున్నభూమి విచ్చిపోయింది! ఆ అఖాత ములో పడ్డాను!

* * * *

శ్రీధరరావుగారు ప్రేమించిన మహారాష్ట్రయువతి పేరు శ్యామల కాదనీ ఆమెపేరు వెల్లడిచెయ్యడానికి ఇష్టము లేక మారుపేరు పెట్టినారనీ ముకుందరావు గారు చెప్పుతున్నారు.

తమజీవితములో ఒక్క అంశమే వ్రాసివుండి శ్రీధర రావుగారు దానికి స్వకీయచరిత్ర అని పేరుపెట్టినారు. జీవితమున కంతకూ మూలాధారమైన ఈ అంశమే ముఖ్యాంశముగా వారు గ్రహించడముచేత అలా పేరు పెట్టివుండ వచ్చును.

౧౯–౨౦